జనపథం - జనపదం

## నమ్మకం - నిత్యానంద్.

'మనీ మేక్స్ మెనీ థింగ్స్' (Money makes many things.) అన్నది మనము విన్న సామెత. నమ్మకము అంతకన్నా శక్తివంతమైన సాధనం. మనలో చాలామందికి వాళ్ళమీద వాళ్ళకి నమ్మకం తక్కువ. తెలిసిన విషయాన్నైనా ఒకరిద్దరిని అడిగి, వారినుండి మనకు తెలిసిన సమాధానము వస్తేనే మనని మనము నమ్ముతాం. ఎవరైనా కోట్లకు పడగలెత్తిన వ్యక్తి స్వానుభవాన్ని వివరిస్తే, అందులో ఆ వ్యక్తి పడిన శ్రమని గుర్తించి అలాంటి వారిని ఆదర్శముగా తీసుకునే బదులు - వాడు అదృష్టవంతుడు, మనకంతటి అదృష్టమేదీ అని చతికిలబడేవారే ఎక్కువ. కష్టపడాలంటే అందరికీ కష్టమే. కాని, ఫలితం మనకి సానుకూలంగా రావాలని ఆశిస్తాము. భగవద్గీత నిత్య పారాయణం చేసేవారు కూడా చాలామంది ఫలితము కోసమే ప్రాకులాడడం మనకు తెలిసినదే. భగవద్గీత సారాంశము తెలిసిన వ్యక్తి, తను చేసే ఏ పనినైనా, అనంతరము ఫలితమేదైనా భగవదర్పిత బుద్ధితో చేస్తాడు. సరే అసలు విషయానికి వస్తే, మెదడు - భగవంతుడు మానవునికిచ్చిన అతి విలువైన సాధనము. మెదడును అదుపులో ఉంచితే అది చేసే కార్యములు ఎవరినైనా ఆశ్చర్యపరుస్తాయి. నా ఉద్దేశ్యంలో 'మైండ్ కెన్ డూ మెనీ థింగ్స్' (Mind can do many things.).

ఒక ఇనుపవస్తువును ఉపయోగిస్తుంటే, అది చక్కగా పనిచేస్తూ ఉంటుంది. వాడకపోతే అది తుప్పు పడుతుంది. అలాగే మన మెదడు కూడా. అందుకే అంటారు 'యూజ్ ఇట్ ఆర్ లూస్ ఇట్' అని. ఏదైనా పనిని మనము చేయగలము అని నమ్మితే, మన మెదడు దానిని ఆచరణలో పెడుతుంది. 'ఈ పని చేయలేము, ఈ పని చేయలేము' అని జపము చేస్తుంటే, నిజానికి మనము ఆ పని చేయలేము. ఎందుకంటే మనము మాట్లాడే ప్రతి మాట, ఆలోచించే ప్రతి ఆలోచన మనము మన మైండ్‌కి ఇస్తున్న ఇన్‌స్ట్రక్షన్. హిప్నోథెరపీ కూడా మన మైండ్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వడమువలన మన అనారోగ్యాన్ని తగ్గించే ప్రక్రియ. నమ్మకము లేకపోతే ఈ ప్రక్రియకూడా నిరుపయోగమే. ఒకసారి ప్రసంగములో ధ్యానసాధన చేసే ఒక సాధకురాలు అన్నట్లు 'నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము' అన్నది అక్షర సత్యం.

ఒకసారి విపరీతమైన గాలివానతో ప్రకృతి కల్లోలంగా ఉంది. చిమ్మచీకటి. ఒక వైద్యుడు రాత్రి భోజనానికి వంట సన్నాహాలు చేస్తున్నాడు. ఇంతలో తలుపు తడుతున్న శబ్దము వినబడింది. వెళ్ళి తలుపు తెరచి చూస్తే ఒక రోగిని తీసుకుని మరో ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు. వారు రోగి లక్షణాలను వైద్యునికి వివరించారు. ఎంతో నమ్మకముతో వారు వర్షములో, చీకటిలో ఆ వైద్యుని సన్నిధికి వచ్చారు. వైద్యో: నారాయణో హరి: అని కదా సూక్తి! వైద్యుడు వారిని కూర్చొనుమని చెప్పి, లోపలనున్న మందులపెట్టెను తెరచి చూస్తే, కావలసిన మందులేదు. వచ్చిన రోగిని అసంతృప్తితో పంపడానికి ఇష్టపడక ఆ వైద్యుడు కొన్ని పంచదార గుళికలను ఇచ్చాడు. రోగి సంతృప్తితో వెళ్ళిపోయాడు. మరుసటిరోజు ఆ రోగి వైద్యుని కలిసి తనని అస్వస్థతనుండి కాపాడినందుకు కృతజ్ఞతను తెలియజేసాడు. అదీ మైండ్ పవర్.

మన మైండ్ ఎలా పనిచేస్తుంది అనే విషయముమీద ఎందరో ఎన్నో ప్రయోగాలు చేసారు. అలాంటి ప్రయోగములో ఒకటి వినండి. ఒకరోజు ఉదయాన్ని ఒక ఉద్యోగి తన కార్యాలయమునకు బయలుదేరాడు. ఇంట్లోనుండి బయటికి రాబోతున్న తరుణములో అతని ఇల్లాలు అతనిని తేరిపార చూసి "ఏమిటలా ఉన్నారు? నలతగా ఉందా? పోనీ ఆఫీసుకు సెలవు పెట్టకూడదూ!" అని అనడముతో అతడు కాస్త తడబడి, "నేను బాగానే ఉన్నాను. నాకేమీ కాలేదు." అని చెప్పి వెళ్ళిపోయాడు. ఇక తన వాహనాన్ని అధిరోహించబోతున్న సమయంలో పొరిగింటాయన "ఏమిటండి అలా నీరసంగా ఉన్నారు? జ్వరమేమైనా ఉందా?" అని ప్రశ్నించగా, "నేను బాగానే ఉన్నానే. మీకెందుకు అలా అనిపించిందో!" అని తన కార్యాలయానికి వెళ్ళిపోయాడు. తన వాహనాన్ని ఆపి, కార్యాలయము దిశగా వెళ్తున్న అతనిని అతని సహోద్యోగి ఆపి, "ఏమిటి సార్ మీరలా డల్‌గా ఉన్నారు. ఫీవర్ ఏమైనా ఉందా?" అని ప్రశ్నించగా కాస్త తటపటాయించి "నేను బాగానే ఉన్నాను. నాకేం జ్వరం లేదు." అని కార్యాలయములో అడుగుపెట్టాడు. కొద్దిసేపటికి అతని పైఅధికారి పిలుపుమేరకు అతని గదిలోకి అడుగుపెట్టగా, ఆ అధికారి "లుక్స్ లైక్ యూ ఆర్ నాట్ డూయింగ్ వెల్. టేక్ సమ్ రెస్ట్. వై డోంట్ యూ టేక్ ఆఫ్ టుడే." అని హెచ్చరించేసరికి, అతనికి కాస్త శంక మొదలయ్యింది. ఇక ఆ గోల పడలేక, సెలవు పెట్టి, ఇంటికి వెళ్ళిపోయాడు. తీరా ఇంటికి వెళ్ళాకా చూస్తే అతనికి నిజంగానే జ్వరం వచ్చింది. ఇదంతా ఒక పథకం ప్రకారం చేసిన ప్రయోగం. ఫలితం మీకు అర్థమయ్యింది కదా! తస్మాత్ జాగ్రత్త!

ఈ కథ మీకందరికీ తెలిసే ఉంటుంది. ఒక ఊర్లో ఒక పండితుడు ఉండేవాడు. అతని ఇంటికి ఒక అమ్మాయి రోజు ఆవు పాలు తెస్తూ, ఆ ఇంటి పనులు చేసి వెళ్ళిపోయేది. ఈ సందర్భములో ఆ గురువుగారు చెప్పే విషయములను కొన్ని కొన్ని గ్రహిస్తుండేది. ఒకసారి గురువుగారు గురువు మహిమను, గురునామము స్మరించడమువలన కలిగే శక్తిగురించి తెలియజేస్తుండగా ఆమె వినడం తటస్థించినది. ఒకరోజు తను పాలు తీసుకుని బయలుదేరే సమయానికి కుంభవృష్టి కురిసి, ఆమె వచ్చే తోవలో నదికి వరద సంభవించినది. ఆమె ఎట్లో గురువుగారి ఇంటిని చేరి, పాలు అందజేసి, మిగిలిన పనులు ముగించిన పిదప, తిరిగి తన పల్లెకు పోవుటకు సంసిద్ధురాలు కాగా, ఆ గురువు "ఇంత వరదలో నీవెట్లా ఇక్కడకు రాగలిగితివని" ప్రశ్నించగా, ఆమెనూ వినయముతో "మీ నామ జపము చేస్తూ నదిని దాటితిన"ని జవాబిచ్చెను. గురువు ఈ విషయమును నమ్మజాలక మరలా ఆమెను నిలదీసెను. అపుడామె గురువు నామము జపిస్తూ నదినీటిపై నడవజొచ్చెను. అది చూసిన గురువు "నాపేరును జపిస్తేనే వేరొకరికి ఇంత శక్తి కలిగినపుడు, నేను ఈ నదిని దాటడం సాధ్యమే కదా!" అని తలచి, ఆ నదిని దాటబోయి విఫలుడయ్యెను. కావున చెప్పడం వేరు, ఆచరించడం వేరు. గురువు గురునామము యొక్క మహిమను వాచా తెలియజేసాడు కాని, త్రికరణశుద్ధిగా నమ్మలేదు. కాని ఆ పని పిల్ల గురునామముయొక్క శక్తిని త్రికరణశుద్ధిగా నమ్మి, ఆచరించి చూపింది. కావున నమ్మకము చాలా శక్తి వంతమైన సాధనము.

*అస్మద్గురుభ్యోనమః సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు!*

*** *** ***